ఆదివారం 19-5-2024

# ముందడుగు దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 339, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com

# ఓటర్లను మోడీ రెచ్చగొడుతున్నారు

## మోడీ వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలి ▪ ఈసీని కోరిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే

**ముందడుగు ఢిల్లీ:**

దేశంలోని ఓటర్లను ప్రధాని నరేంద్ర మోడీ రెచ్చగొడుతున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. భారత కూటమి అధికారంలోకి వస్తే రామ మందిరంపై బుల్డోజర్ నడుపుతారన్న మోడీ వ్యాఖ్యలపై ఎన్నికల కమిషన్ (ఈసీ) చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శనివారం మహారాష్ట్రలోని ముంబైలో 'ఇండియా' బ్లాక్ నేతలు సమావేశమయ్యారు. అనంతరం ఎన్సీపీ (శరద్) చీఫ్ శరద్ పవార్, శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రేతో కలిసి మీడియాతో ఖర్గే మాట్లాడారు. ప్రధాని మోడీ ఓటర్లను రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారని ఆరోపించారు. 'మేం ఇప్పటి వరకు బుల్డోజర్లు వాడలేదు. ప్రధాని స్వయంగా చేస్తున్నారు. ప్రజలను రెచ్చగొడుతున్నారు. రెచ్చగొట్టే ప్రసంగాలు చేసే వారిపై ఈసీ చర్యలు తీసుకోవాలి. మా ప్రభుత్వం వచ్చిన తర్వాత రాజ్యాంగం ప్రకారం అన్నింటికీ రక్షణ కల్పిస్తాం. మేం రాజ్యాంగాన్ని అనుసరిస్తాం' అని అన్నారు.



మహారాష్ట్రలో నిజమైన పార్టీలకు కాకుండా బీజేపీకి మద్దతు ఇచ్చే వర్గాలకు పార్టీ గుర్తులను ఈసీ కేటాయించడాన్ని మల్లికార్జున్ ఖర్గే తప్పుపట్టారు. ద్రోహం, కుట్రల ఆధారంగా మహారాష్ట్రలో అక్రమంగా 'మహాయుతి' ప్రభుత్వం ఏర్పడిందని విమర్శించారు. ప్రధాని మోదీ స్వయంగా మద్దతు ఇచ్చారని, ఆయన ఎక్కడికి వెళ్లినా ప్రజల్లో చీలిక తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఖర్గే ఆరోపించారు.




## భారతీయ యువకులతో సైబర్ క్రైమ్‌లు

వివరాలు 3లో

# దేశంలోని ఆలయాలకు యువతను రప్పించాలి

- సమాజాన్ని మార్చే శక్తి గుడులకు ఉంటుంది
- ఇస్రో చైర్మన్ సోమనాథ్ ఆసక్తికర వ్యాఖ్యలు



**ముందడుగు కేరళ:**

సమాజాన్ని మార్చే శక్తి గుడులకు ఉంటుంది. దేశవ్యాప్తంగా ఉన్న ఆలయాలకు యువతను రప్పించాలి. యువత ఆలయాలకు రావాలంటే ఆలయాల్లో తప్పనిసరిగా గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలని ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కేరళ రాజధాని తిరువనంతపురంలోని శ్రీ ఉదియనూర్ దేవీ ఆలయంలో ఇస్రో మాజీ ఛైర్మన్ మాధవన్ నయ్యర్ చేతుల మీదుగా ఆయన శనివారం ఓ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా సోమనాథ్ మాట్లాడుతూ.. ఆలయాలు దేవుడిని స్మరించుకునేందుకు వచ్చే వృద్ధులకు మిగతా 2లో

### బయట యూపీఎస్సీ పరీక్షలు రాసే వారికి

# మూడు వేలు ఇవ్వండి

## మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశాలు

**ముందడుగు మణిపూర్:**

మణిపూర్ వెలుపల యుపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్‌కు హాజరయ్యే వారికి రోజుకు మూడు వేలు ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మే 26న యుపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ జరుగనున్నది. అయితే అల్లర్లు, హింసాత్మక సంఘటనలతో మణిపూర్ అట్టుడిగిపోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మణిపూర్ వెలుపల పరీక్షా కేంద్రాలను మార్చాలని, రవాణా సౌకర్యం కల్పించాలని కోరుతూ 140 మంది అభ్యర్థులు తొలుత ఢిల్లీ హైకోర్టును ఆ తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మణిపూర్‌లోని కొండ మిగతా 2లో








## లోక్‌సభ ఎన్నికల తనిఖీల్లో రూ.8,889 కోట్లు స్వాధీనం

వివరాలు 4లో

## కేంద్ర ఆర్థిక మంత్రికి మెట్రోలో సీటు ఇవ్వలేదు

నిలబడి ప్రయాణించిన నిర్మలా సీతారామన్

వివరాలు 2లో

## గ్రేటర్ జోన్‌లో నడిచే ఆర్టీసీ బస్సులు 2,900

వివరాలు 3లో



## ఎయిర్ ఫోర్స్ అకాడమీలో మంచి అవకాశాలు

వివరాలు 4లో

## ఇకపై యాదాద్రి కొండపై ప్లాస్టిక్ నిషేధం

వివరాలు 2లో

ముందడుగు
ఆదివారం, 19-5-2024, హైదరాబాద్

# ఇకపై యాదాద్రి కొండపై ప్లాస్టిక్ నిషేధం

## వివిధ భాగాలకు ఈవో ఉత్తర్వులు జారీ

**ముందడుగు తెలంగాణ:**

తెలంగాణలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాలలో యాదాద్రి ఒకటి. ఇకనుండి యాదాద్రి కొండపై ప్లాస్టిక్‌ను నిషేధిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో తిరుపతి తర్వాత భక్తులు అత్యధికంగా సందర్శించే ఆలయం యాదాద్రి అని చెప్పుకోవచ్చు. అందుకే ఈ ఆలయ రద్దీ కూడా పెరిగింది. ఆలయ అధికారులు భక్తుల సౌకర్యార్థం అనేక ఏర్పాట్లను కూడా చేస్తున్నారు. ఈ మేరకు ఆలయ అధికారులు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తిరుమల తిరుపతి తరహాలో ఈ కొండపై కూడా ప్లాస్టిక్‌పై నిషేదాన్ని విధించారు. తిరుమల ఆలయంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా టీటీడీ ప్లాస్టిక్‌ను నిషేదించింది. ఇదే పద్ధతిని అన్నవరం దేవస్థానంలోనూ పాటిస్తున్నారు. ఇప్పుడు యాదాద్రిలోనూ ప్లాస్టిక్‌పై అధికారులు నిషేదం విధించారు. ఈ ఆలయాల్లోకి భక్తులు, సిబ్బంది ఎవరూ ప్లాస్టిక్ వంటి వస్తువులేవీ తీసుకెళ్లటానికి వీళ్లేదు. పర్యావరణ పరిరక్షణలో భాగాంగా ప్లాస్టిక్ వాడకం నిషేదిస్తున్నట్లు యాదాద్రి ఆలయ ఈవో భాస్కరరావు తెలిపారు.



## దేశంలోని ఆలయాలకు యువతను రప్పించాలి

**మొదటిపేజీ తరువాయి**

మాత్రమే కాకుండా సమాజాన్ని మార్చే ప్రదేశాలుగా మారాలన్నారు. నా అవార్డు ప్రదాన కార్యక్రమంలో యువత ఎక్కువగా కనిపిస్తారని ఆశించాను. కానీ యువత ఎక్కువగా రాలేదు. వారిని ఆకర్షించడానికి ఆలయాల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలని సోమనాథ్ సూచించారు. పుస్తకాలు చదివే ఆసక్తి ఉన్న యువత ఆలయాల బాట పడతారు. పుస్తకాలు చదివి జ్ఞానసంపద పెంచుకుని, ఉన్నతమైన జీవితానికి బాటలు వేసుకుంటారు. ఆలయ సిబ్బంది లైబ్రరీలను అందుబాటులోకి తెస్తే ఎన్నో మార్పులు చూడవచ్చు అని సోమనాథ్ ఆసక్తికర సలహా ఇచ్చారు.

## బయట యూపీఎస్సీ పరీక్షలు రాసే వారికి మూడు వేలు ఇవ్వండి

**మొదటిపేజీ తరువాయి**

జిల్లాల అభ్యర్థులు ఎంచుకున్న ఇంఫాల్ పరీక్షా కేంద్రాన్ని మార్చడానికి అనుమతిస్తామని మార్చి 29న ఢిల్లీ హైకోర్టు పేర్కొంది. అలాగే వారికి ప్రయాణ ఏర్పాట్లు చేయడంతోపాటు ఖర్చుల నిమిత్తం రోజుకు రూ.1500 చొప్పున భత్యం ఇవ్వాలని మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. మరోవైపు మణిపూర్ వెలుపల పరీక్షా కేంద్రాలు ఎంచుకున్న, మార్చుకున్న అభ్యర్థుల పిటిషన్లపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు జేబీ పార్దివాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. అభ్యర్థులకు రవాణా ఏర్పాట్లు చేయాలన్న హైకోర్టు ఆదేశం ఆచరణాత్మకం కాదని అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో హైకోర్టు సూచించిన రోజువారీ భత్యాన్ని రూ. 1,500 నుంచి రూ.3,000కు సుప్రీంకోర్టు పెంచింది. ఈ ప్రయోజనం పొందాలనుకునే మణిపూర్ అభ్యర్థులు ఈమెయిల్ ద్వారా వారి చిరునామా పరిధిలోని నోడల్ అధికారిని సంప్రదించాలని పేర్కొంది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

## వారం రోజుల్లో నాలుగు లక్షలకుపైగా భక్తులు

### 60శాతం పెరిగిన చార్‌ధామ్ యాత్రికులు



**ముందడుగు ఉత్తరాఖండ్:**

ఉత్తరాఖండ్‌లోని చార్‌ధామ్ యాత్రకు ఇప్పటివరకు నాలుగు లక్షల మందికి పైగా సందర్శించారు. గతేడాదితో పోలిస్తే దాదాపు 60శాతం యాత్రికుల సంఖ్య పెరిగింది. గత సంవత్సరం 2024తో పోలిస్తే 2023లో చార్‌ధామ్‌ను సందర్శించిన వారి సంఖ్య దాదాపు సగం. గణాంకాల ప్రకారం ఈ సంఖ్య 2.50 లక్షలు. ఈ సంవత్సరం చార్ధామ్ యాత్ర డేటాను విశ్లేషించినప్పుడు, యాత్రికుల సంఖ్య 2024లో కొత్త రికార్డును సృష్టించింది. ఇదే సమయంలో గతేడాదితో పోలిస్తే బద్రీనాథ్ ధామ్‌ను సందర్శించే భక్తుల సంఖ్య తగ్గింది.

ప్రభుత్వ డేటా ఆధారంగా సోషల్ డెవలప్‌మెంట్ ఫర్ కమ్యూనిటీ ఫౌండేషన్ ఈ విశ్లేషణ చేసింది. దీనిలో మే 10 నుండి 16 మధ్య వారంలో సందర్శించిన భక్తుల సంఖ్యను విశ్లేషించారు. 2024లో ఆలయ తలుపులు తెరిచినప్పటి నుండి నాలుగు లక్షల మందికి పైగా ప్రజలు కేదార్‌నాథ్, బద్రీనాథ్, గంగోత్రి, యమునోత్రి ధామ్‌లను సందర్శించారు. నాలుగు లక్షలకు పైగా దర్శనం తర్వాత కూడా చార్‌ధామ్‌లో దర్శనం కోసం రిజిస్ట్రేషన్ల సంఖ్య నిరంతరం పెరుగుతోంది. ఈ నమోదు సంఖ్య 28 లక్షలకు పైగా పెరిగింది. ఇందులో కేదార్‌నాథ్ ధామ్ 33.51 శాతం, యమునోత్రి ధామ్ 15.71 శాతం, గంగోత్రి ధామ్ 17.84 శాతం, బద్రీనాథ్ ధామ్ 30.57 శాతం నమోదు అయ్యాయి. చార్‌ధామ్‌కు వెళ్లే యాత్రికులు రిజిస్ట్రేషన్ సమయంలో వారి ఆరోగ్యం గురించి సరైన సమాచారం ఇవ్వడం లేదు. ఇప్పటి వరకు, చార్‌ధామ్ యాత్రలో మొత్తం 11 మరణాలు నమోదయ్యాయి. పెరుగుతున్న రిజిస్ట్రేషన్ల కారణంగా, ఆఫ్‌లైన్ రిజిస్ట్రేషన్ మే 19 వరకు మూసివేయబడింది.

## ఇంటి నుంచే ఓటేసిన మాజీ ప్రధాని, మాజీ ఉపరాష్ట్రపతి

### డాక్టర్ మన్మోహన్ సింగ్, హమీద్ అన్సారీ, అద్వానీ

**ముందడుగు జాతీయం**


దేశంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ విడతల వారీగా కొనసాగుతోంది. మొత్తం ఏడు విడతల్లో పోలింగ్ జరుగుతుంది. ఇప్పటికే నాలుగు దశల్లో ఓటింగ్ పూర్తైంది. ఐదో దశ పోలింగ్ మే 20న సోమవారం జరగనుంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ పార్లమెంటరీ నియోజకవర్గానికి పలువురు ప్రముఖులు ఇంటి నుంచే ఓటేశారు. మాజీ ఉపరాష్ట్రపతి మహ్మద్ హమీద్ అన్సారీ, మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్, కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ మురళీ మనోహర్ జోషి ఇంటి నుంచే ఓటు వేసే సౌకర్యాన్ని వినియోగించుకున్నట్లు ఢిల్లీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ తెలిపారు. ఢిల్లీ లోక్‌సభ స్థానాలకు ఆరో విడతలో భాగంగా మే 25న పోలింగ్ జరగనుంది.

లోక్‌సభ ఎన్నికల్లో తొలిసారిగా వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి నుంచి ఓటు వేసే వెసులుబాటును ఎన్నికల సంఘం అందుబాటులోకి తెచ్చింది. 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, 40 శాతానికిపైగా అంగ వైకల్యం ఉన్నవారు ఇంటి నుంచే ఓటు వేయొచ్చు. పోలింగ్ సిబ్బంది ఓటరు ఇంటి వద్దకే వచ్చి ఓటు వేయించుకుంటారు. నిబంధనలకు అనుగుణంగా ఓ కంపార్టుమెంట్, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌ను తెస్తారు.



## కేంద్ర ఆర్థిక మంత్రికి మెట్రోలో సీటు ఇవ్వలేదు

### నిలబడి ప్రయాణించిన నిర్మలా సీతారామన్



**ముందడుగు ఢిల్లీ:**

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఢిల్లీ మెట్రోలో ప్రయాణించారు. అయితే ఆమెకు ఎవరు కూడా సీట్ ఇవ్వలేదు. ఆమెన ఒక సామాన్య పౌరురాలిగానే చూశారు. నిర్మలా ఢిల్లీ మెట్రోలో లక్ష్మీ నగర్ వరకు నిలబడి ప్రయాణించారు. మిగతా ప్రయాణికులు ఆమెను పట్టించుకున్నట్లు కూడా కనిపించలేదు. సీనియర్ సిటిజన్ నిర్మలా సీతారామన్ కు సీటు ఇవ్వకపోవడం పలువు నెటిజన్లు భిన్నంగా స్పందించారు. పెద్దావిడను గౌరవించి సీట్ ఇవ్వాల్సిందేనని ఒకరు కామెంట్ చేశారు. మరొకరు ఆమె మంత్రి కారులో కూడా వెళ్లొచ్చు.. మెట్రోల పబ్లిసిటీ కోసం ఇలా ప్రయాణిస్తారని మరొకరు కామెంట్ చేశారు.

మరికొందరు ఎవరినైనా సమానంగా చూడాలని.. మంత్రి అని సీటు ఇవ్వడం, సాధారణ వృద్ధురాలు అయితే సీటు ఇవ్వకపోవడం మంచిది కాదున్నారు. భారత రాజ్యాంగం అందరికి సమాన హక్కులు ఇచ్చిందని గుర్తు చేస్తున్నారు.

ముందడుగు
ఆదివారం, 19-5-2024, హైదరాబాద్

# తెలుగు రాష్ట్రాలకు భారీ వర్ష సూచన

- అల్పపీడనం వాయుగుండంగా మారే అవకాశం
- వాతావరణ శాఖ అధికారులు వెల్లడి



**ముందడుగు హైదరాబాద్:**

తెలుగు రాష్ట్రాల్లో రానున్న రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. శనివారం సాయంత్రం హైదరాబాద్‌లో భారీ వర్షం కురుస్తుందని తెలిపింది. వికారాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, శంకర్‌పల్లి ప్రాంతాల్లో భారీ వానలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. దీంతో పాటు నగరం లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది.

నైరుతి బంగాళాఖాతంలో ఈనెల 22న అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ చెప్పింది. ఇది మే 24 నాటికి వాయుగుండంగా మారే అవకాశం ఉందని పేర్కొంది. దీని ప్రభావంతో ఈనెల 23 వరకు ఏపీ, తెలంగాణలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. కోస్తాంధ్ర, తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వానలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

హైదరాబాద్ సహా పలు ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. దీంతో పాటు వానల సమయాల్లో ప్రయాణాలు చేసే ప్రజలు కూడా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇదిలా ఉంటే శనివారం మధ్యాహ్నం నుంచి హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది. రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. ఇంకోవైపు ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

## గ్రేటర్ జోన్‌లో నడిచే

# ఆర్టీసీ బస్సులు 2,900

- మహిళ ప్రయాణికుల కోసం మరిన్ని కొత్త బస్సులు
- రోజూ 20 లక్షల మంది ప్రయాణికులకు సేవలు

**ముందడుగు హైదరాబాద్ :**



మహాలక్ష్మి ఉచిత ప్రయాణాలతో హైదరాబాద్ సిటీ బస్సుల్లో రోజువారీ ప్రయాణికుల సంఖ్య 20 లక్షలకు పెరిగింది. ఒక్కసారిగా ప్రయాణికుల రద్దీ రెట్టింపు కావడంతో నగర ప్రయాణికుల సౌలభ్యం కోసం కొత్త బస్సులపై ఆర్టీసీ దృష్టిపెట్టింది. దీంతో.. గ్రేటర్‌లో ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచుకునే దిశగా ఆర్టీసీ ప్రయత్నాలు మొదలు పెట్టింది. కొత్త ప్రణాళికలు సిద్ధం అవుతున్నాయి.

గ్రేటర్ పరిధిలో ఆర్టీసీలో మహిళా ప్రయాణీకుల సంఖ్య పెరుగుతోంది. దీంతో, గ్రేటర్‌లో ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచుకునే దిశగా ఆర్టీసీ ప్రయత్నాలు మొదలు పెట్టింది. జూన్ 15 నాటికి నగరంలో 150 కొత్త బస్సులు రోడ్లపైకి తీసుకొచ్చే దిశగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. వీటిలో 125 మెట్రో డీలక్స్ బస్సులు, 25 ఎలక్ట్రిక్ బస్సులు ఉండనున్నట్లు, వీటిని విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా అధికారులు పనిచేస్తున్నారు. మరో ఆరు నెలల్లో గ్రేటర్‌లో దశలవారీగా 450 ఎలక్ట్రిక్ బస్సులు తీసుకొచ్చేలా కసరత్తు చేస్తున్నారు.

గ్రేటర్ జోన్‌లో ఆర్టీసీ ప్రస్తుతం 2,900 బస్సులు నడుపుతూ రోజూ 20 లక్షల మందికి సేవలందిస్తోంది. 2024 డిసెంబర్ నాటికి గ్రేటర్ జోన్‌లో బస్సుల సంఖ్య 3,500కు పెంచుకోవడమే లక్ష్యంగా పెట్టుకుంది. జూన్‌లో వచ్చే 125 మెట్రో డీలక్స్ బస్సుల్లో 2/2 సీటింగ్ సామర్థ్యం అందుబాటులోకి వస్తుంది. బస్సుల సంఖ్య పెరిగితే రోజువారీ ప్రయాణికుల సంఖ్య 30 లక్షలకు చేరే అవకాశముంటుందని అంచనా వేస్తున్నారు. శివారు ప్రాంతాలు విస్తరిస్తున్న నేపథ్యంలో అన్ని ప్రాంతాలను కలుపుతూ ఆర్టీసీ బస్సుల రూట్ మ్యాప్‌లను అందుబాటులోకి తేవాలని భావిస్తున్నారు.

## గ్లోబల్ అంబాసిడర్ ఫర్

# వాటర్ అయొనైజర్


### అవార్డు అందుకున్న జగన్నాధ శాస్త్రి సోమంచి




**ముందడుగు హైదరాబాద్:**

హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త జగన్నాధ శాస్త్రి సోమంచికి ప్రతిష్ఠాత్మకమైన "గ్లోబల్ అంబాసిడర్ ఫర్ వాటర్ అయొనైజర్" బిరుదు లభించింది. ముంబైలోని నెట్‌వర్క్ ఎక్స్‌ప్రెస్ నిర్వహించిన "డైరెక్ట్ సెల్లింగ్ గ్రోత్ కాన్క్లేవ్ 2024"లో ప్రముఖ వ్యాపార కోచ్, రచయిత మరియు మోటివేషనల్ ట్రైనర్ అయిన దీపక్ బజాజ్ అందించారు.

ముంబైలోని షణ్ముఖానంద ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో భారతదేశ వ్యాప్తంగా 36 కంపెనీలు పాల్గొనగా, 3,000 మందికి పైగా పాల్గొన్నారు. జగన్నాధ శాస్త్రి, డైరెక్ట్ సెల్లింగ్ పరిశ్రమలో 20 సంవత్సరాల అనుభవంతో, గత 8 సంవత్సరాలుగా తన ఎనాజిక్ ప్రయాణంలో 30,000 కంటే ఎక్కువ కుటుంబాలను ప్రభావితం చేసి, గౌరవనీయమైన 6A25 గ్లోబల్ ర్యాంక్‌ను సాధించారు. ఇంత పెద్ద మరియు నిమగ్నమైన ప్రేక్షకుల సమక్షంలో దీపక్ బజాజ్ నుండి ఈ అవార్డును అందుకోవడం నిజమైన గౌరవం" అని జగన్నాధ శాస్త్రి అన్నారు.



## జూన్ 8న చేప ప్రసాదం పంపిణీ

**ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు**

**ముందడుగు హైదరాబాద్:**

హైదరాబాద్ లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జూన్ 8 నుంచి చేప ప్రసాదం పంపిణీ జరగనుంది. దీనికి సంబంధించిన కీలక ప్రకటన ప్రసాదం పంపిణీదారు బత్తిన ఫ్యామిలీ చేసింది. ప్రతి సంవత్సరం మృగశిర కార్తె రోజు ఇచ్చే చేప ప్రసాదం ఇచ్చేందుకు ఈ ఏడాది కూడా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. జూన్ 8న ప్రసాదం పంపిణీ చేయనున్నట్టు ప్రకటించారు. ఈ ప్రసాదం తింటే ఆస్తమా తగ్గుతుందని వేల మంది ప్రజలు నమ్ముతున్నారు. అందుకే ఈ ప్రసాదం ఎప్పుడెప్పుడు ఇస్తారా అని ఎదురు చూసే వాళ్ల సంఖ్య వేలల్లో ఉంటుంది. హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఈ చేప ప్రసాదం బత్తిని కుటుంబం పంపిణీ చేయనుంది.

# భారతీయ యువకులతో సైబర్ క్రైమ్‌లు

## చేయిస్తున్న చైనా ముఠాలు

**ముందడుగు క్రైం:**

నిరుద్యోగ యువకులను ఎంపిక చేసుకొని విదేశాల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగాలని చెప్పి.. చైనా ముఠాలకు నిరుద్యోగులను విక్రయిస్తున్న ఏజెంట్లను విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. గాజువాకకు చెందిన చుక్క రాజేశ్ ఇంజినీరింగ్ చదివి గల్ఫ్ దేశాల్లో పని చేశాడు. 2021 నుంచి ఆ దేశాలకు మ్యాన్ పవర్ సప్లయ్ చేయడం మొదలుపెట్టాడు. 2023లో సంతోష్ సాయంతో 27 మందిని కంబోడియాకు పంపించాడు. టికెట్స్, వీసా పేరుతో ఒక్కొక్కరి దగ్గర రూ.90 వేల వరకు వసూలు చేసి.. వారిని చైనా ముఠాలకు విక్రయించాడు. మరో ఏజెంట్ ఆర్య ద్వారా ఇలాగే ఒక్కో బాధితుడి నుంచి రూ.1,10,000 వసూలు చేశాడు. హబీబ్, ఉమామహేశ్ ఏజెంట్ల



సాయంతో దాదాపు 150 మందిని బ్యాంకాక్ గుండా కంబోడియాకు పంపించాడు. అక్కడ వీరిని చైనా కంపెనీలకు విక్రయించి సొమ్ము చేసుకున్నాడు. చైనా ముఠాల చేతికి చిక్కిన బాధితులకు సైబర్ నేరాల్లో శిక్షణ ఇప్పించేవారు. ఎదురు తిరిగిన వారిని చిత్రహింసలకు గురి చేసి తమ దారికి తెచ్చుకునేవారు. ఈ ముఠా నుంచి తప్పించుకున్న బాధితుడు బొత్స శంకర్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా విశాఖ సీపీ రవి శంకర్, జాయింట్ సీపీ ఫక్కీరప్పల పర్యవేక్షణలో సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ కె.భవానీ ప్రసాద్ విచారణ చేపట్టారు. నిందితుడు రాజేశ్, ఏజెంట్స్ సబ్బవరపు కొండలరావు, మన్నేన జ్ఞానేశ్వర్‌రావులను అరెస్టు చేశారు. చైనా ముఠాలు భారతీయులతో సైబర్ క్రైమ్‌లు చేయిస్తున్న విషయాన్ని ప్రజలు గమనించి అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ ముఠా బాధితులు ఎవరైనా ఉంటే తక్షణమే పోలీసుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

ముందడుగు
ఆదివారం, 19-5-2024, హైదరాబాద్

# లోక్‌సభ ఎన్నికల తనిఖీల్లో రూ.8,889 కోట్లు స్వాధీనం

- మాదక ద్రవ్యాలదే 45 శాతం వాటా
- అత్యధికంగా గుజరాత్‌లో రూ.1,461.73 కోట్లు పట్టివేత




**ముందడుగు జాతీయం:**

దేశంలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల వేళ ఓటర్లను ఆకట్టుకునేందుకు దేశవ్యాప్తంగా పెద్దఎత్తున ప్రలోభాల పర్వం సాగుతున్నట్లు తెలుస్తోంది. సార్వత్రిక ఎన్నికల క్రమంలో చేపట్టిన తనిఖీల్లో ఇప్పటివరకు రూ.8,889 కోట్ల మేర విలువైన నగదు, మాదక ద్రవ్యాలు, ఇతర తాయిలాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. జప్తు చేసిన సొత్తులో మాదక ద్రవ్యాలదే 45 శాతం వాటా అని, రూ.3,958 కోట్ల మేర డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించింది.

స్వాధీనం చేసుకున్న సొత్తులో నగదు రూపేణా రూ.849.15 కోట్లు, మద్యం (రూ.814.85 కోట్లు), మాదక ద్రవ్యాలు (రూ.3,958 కోట్లు), బంగారం, వెండి వంటి ఆభరణాలు (రూ.1,260.33 కోట్లు), ఇతర ఉచితాలు (రూ.2006.59 కోట్లు) ఉన్నట్లు ఈసీ తెలిపింది. మాదక ద్రవ్యాలు, సైకోట్రోపిక్ పదార్థాల స్వాధీనంపై ఈసారి ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొంది. గుజరాత్ ఏటీఎస్, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, ఇండియన్ కోస్ట్ గార్డ్‌లు కలిసి చేపట్టిన ఆపరేషన్లలో కేవలం మూడు రోజుల్లోనే రూ.892 కోట్ల విలువైన డ్రగ్స్ పట్టుబడినట్లు వెల్లడించింది.

అత్యధికంగా గుజరాత్‌లో రూ.1,461.73 కోట్ల విలువైన ప్రలోభాలను స్వాధీనం చేసుకున్నట్లు ఈసీ నివేదికలో వెల్లడైంది. రాజస్థాన్ (రూ.1133.82 కోట్లు), పంజాబ్ (రూ.734.54 కోట్లు) రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో చూసుకుంటే ఆంధ్రప్రదేశ్‌లో రూ.301.75 కోట్లు, తెలంగాణలో రూ.333.55 కోట్ల సొత్తు జప్తు చేసింది.

# ఎయిర్ ఫోర్స్ అకాడమీలో మంచి అవకాశాలు

టెన్త్, ఇంటర్ పూర్తి అయినా వారికి ఎన్నో మార్గాలు ■ దేశ సేవ చేస్తూ డబ్బు సంపాదించే అవకాశం

**ముందడుగు ప్రత్యేకం:**

విద్యా సంవత్సరం మారింది. కొత్తగా టెన్త్, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన వారు, తర్వాత ఏం చదవాలి, ఏం చేయాలని ఆలోచిస్తుంటారు. అయితే పదో తరగతి నుంచే కెరీర్ ప్లాన్ చేసుకోవడం మంచిది. టెన్త్ క్లాస్ పాస్ అయ్యాక కొందరు డిప్లొమా కోర్సులు చదివితే, మరికొందరు హయ్యర్ సెకండరీ ఎడ్యుకేషన్‌పై దృష్టి పెడతారు. ఆ తర్వాత కెరీర్ ప్లాన్ చేసుకుంటారు. అయితే అర్హత ఉన్నవారు ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో చేరి, దేశానికి సేవ చేయవచ్చు. ఇందుకు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అకాడమీలో చేరాల్సి ఉంటుంది.

ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అకాడమీని 1969లో స్థాపించారు. హైదరాబాద్ సమీపంలోని దుండిగల్‌లో ఉన్న ఈ సంస్థ, ఇండియన్ ఎయిర్ ఫోర్స్ కు చెందిన ప్రీమియం ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్. ఇది హైదరాబాద్ నుంచి 43 కి.మీ దూరంలో ఉంది. ఇక్కడ ఫ్లయింగ్, టెక్నికల్, గ్రౌండ్ డ్యూటీ బ్రాంచ్‌లకు ట్రైనింగ్ ఇస్తారు. అలాగే ఆర్మీ, నేవీ అధికారులకు ఫ్లయింగ్ ట్రైనింగ్ ఇస్తారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అకాడమీలో చేరడానికి కొన్ని మార్గాలు ఉన్నాయి.



## ఎయిర్ ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్

ఎయిర్ ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్ ద్వారా మేల్, ఫిమేల్ స్టూడెంట్స్ ఎయిర్ ఫోర్స్ అకాడమీలో చేరవచ్చు. ఈ ఎగ్జామ్‌ను ఫిబ్రవరి, ఆగస్టులో సంవత్సరానికి రెండు సార్లు నిర్వహిస్తారు. అభ్యర్థులు గ్రాడ్యుయేట్ లేదా ఇంజనీర్ అయి ఉండాలి. ఆసక్తి ఉన్నవారు ఎఎఫ్ఎ ఫ్లయింగ్ బ్రాంచ్‌లో 14 సంవత్సరాల పాటు షార్ట్ సర్వీస్ కమిషన్ కోసం కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. కోర్సు ప్రారంభించే సమయానికి అభ్యర్థుల వయసు తప్పనిసరిగా 20 నుండి 24 ఏళ్ల మధ్య ఉండాలి. ఎయిర్ ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్ క్లియర్ చేసిన అభ్యర్థులను ఎయిర్ ఫోర్స్ సెలక్షన్ బోర్డ్ కి పిలుస్తారు.

## నేషనల్ డిఫెన్స్ అకాడమీ

ఇంటర్ లేదా 12వ తరగతి పూర్తి చేసిన వారు ఎన్డీఏ ద్వారా ఎయిర్ ఫోర్స్ అకాడమీలో చేరవచ్చు. వీరికి మొదటి మూడు సంవత్సరాలు పూణేలోని ఎన్డీఏ ఖడక్వాస్లాలో శిక్షణ ఉంటుంది. అనంతరం ఎఎఫ్ఎలో ఫ్లయింగ్ ట్రైనింగ్ ఇస్తారు. అభ్యర్థి ఎయిర్ ఫోర్స్‌ను ఎంచుకుంటే, ఎన్డీఏ ద్వారా ఎఎఫ్ఎ ఫ్లయింగ్ బ్రాంచ్‌లో మాత్రమే చేరవచ్చు. డిఫెన్స్ సెక్టార్‌పై ఆసక్తి ఉన్నవారు ఏదైనా ఎన్డీఏ ఎగ్జామ్‌కు హాజరుకావచ్చు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో ప్రవేశానికి, అభ్యర్థులు తప్పనిసరిగా పరీక్షలో క్వాలిఫై అయ్యి, తర్వాత సర్వీస్ సెలక్షన్ బోర్డ్ ఇంటర్వ్యూ క్లియర్ చేయాలి.

## సిడిఎస్ఈ

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సంవత్సరానికి రెండుసార్లు కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తుంది. దీని ద్వారా ఎయిర్ ఫోర్స్ అకాడమీలో ట్రైనింగ్‌కు ఎంపికైన వారు ఫైటర్ పైలట్లు, హెలికాప్టర్ పైలట్లు లేదా ట్రాన్స్‌పోర్ట్ పైలట్లుగా శిక్షణ పొందుతారు.

## ఎన్ సిసి

నేషనల్ క్యాడెట్ కార్ప్స్‌లో ఎయిర్ వింగ్ సీనియర్ డివిజన్ సి సర్టిఫికేట్ హోల్డర్స్, ఎఫ్ఎ ఫ్లయింగ్ బ్రాంచ్‌కి అప్లై చేసుకోవచ్చు.

# ఈసీ సీవిజిల్ యాప్‌కు పెద్ద ఎత్తున ఫిర్యాదులు

రెండు నెలల్లోనే 4.24 లక్షల ఫిర్యాదులు ■ 89 శాతం కేసులను 100 నిమిషాల్లోనే ఛేదించారు ■ ఎన్నికల కమిషన్ తాజాగా వెల్లడి

**ముందడుగు జాతీయం:**

దేశంలో జరుగుతున్న లోక్ సభ ఎన్నికల్లో ఫిర్యాదుల కోసం ఎన్నికల సంఘం తీసుకొచ్చిన 'సీవిజిల్ ' యాప్‌నకు విపరీతంగా తాకిడి పెరిగింది. కేవలం రెండు నెలల్లోనే దీనికి 4.24 లక్షల ఫిర్యాదులు వచ్చినట్లు ఈసీ తాజాగా వెల్లడించింది. వీటిలో ఇప్పటికే మెజార్టీ ఫిర్యాదులను పరిష్కరించామని తెలిపింది. ''మార్చి 16న ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటినుంచి ఇప్పటివరకు కోడ్ ఉల్లంఘనలపై 4,24,317 ఫిర్యాదులు అందాయి. ఇందులో 4,23,908 ఫిర్యాదులను పరిష్కరించాం. దాదాపు 89 శాతం కేసులను 100 నిమిషాల్లోనే ఛేదించాం. ఇంకా 409 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి'' అని ఈసీ వెల్లడించింది. నమోదైన కేసుల్లో అత్యధికం (3.24 లక్షలు) అక్రమ బ్యానర్లు, పోస్టర్లపైనే వచ్చాయని తెలిపింది. ఆస్తులను పాడుచేయడంపై 14,022.. నగదు, మద్యం, బహుమతుల పంపిణీపై 7,022.. గడువు ముగిసిన తర్వాత ప్రచారంపై 4,742.. మతపరమైన ప్రసంగాలపై 2,883.. మారణాయుధాలతో బెదిరింపులపై 2,430 ఫిర్యాదులు వచ్చినట్లు ఈసీ వెల్లడించింది. కోడ్ ఉల్లంఘనలకు పాల్పడేవారిని గుర్తించేందుకు 'సీవిజిల్' అనేది పౌరుల చేతుల్లో ఉన్న సమర్థమంతమైన సాధనమని పేర్కొంది.

